కేసీఆర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న ముక్రా(కే) రైతులు

రైతు బాంధవుడా మళ్లీ మీరే రావాలి

ఇచ్చోడ, మార్చి 30: 'రైతు బాంధవుడా మళ్లీ మీరే రావాలి' అంటూ ఉగాది పర్వదినాన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రైతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు లేక, రుణమాఫీ కాక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో టింగ్ టింగ్ అంటూ పంట పెట్టుబడికి రైతుబంధు వచ్చేదని అన్నారు. వానకాలం రైతుబంధు కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని, రుణమాఫీ కూడా అందరికీ చేయలేదని, అందుకే కేసీఆర్ వస్తేనే పంటకు పెట్టుబడి సాయం సమయానికి వస్తదని వారు పేర్కొన్నారు. కేసీఆర్ వస్తేనే తమ బతుకులు మారుతాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, రైతులు పాల్గొన్నారు.

మందెయ్.. చిందెయ్!

మొదటిపేజీ తరువాయి...

రూ.లక్షగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ లక్ష రూపాయలు తిరిగి ఇవ్వబోమని నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. ఏప్రిల్ 26 వరకు దరఖాస్తుల ఆఖరు తేదీ అని, అప్పటి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని అబ్కారీ శాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఒక్కో బారుకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తారు.

నెలకు రూ.5100 కోట్ల ఆదాయం టార్గెట్

మద్యం విక్రయాల ద్వారా రోజుకు సగటున రూ.120 కోట్ల ఆదాయం సమకూరుతున్నది. ఎక్సైజ్, వ్యాట్ ఆదాయం కలుపుకొని నెలకు రూ రూ.3600 కోట్లు సమకూరుతున్నది. ఈ ఆదాయాన్ని సగటున రోజుకు రూ.170 కోట్ల చొప్పున నెలకు రూ.5100 కోట్లకు పెంచాలని ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వం టార్గెట్ పెట్టినట్టు ఆ శాఖ సీనియర్ అధికారుల్లో చర్చ నడుస్తున్నది. ఇందులో భాగంగానే ఇటీవల బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం త్వరలోనే బ్రాందీ, విస్కీ ధరల పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కొత్తగా మరి కొన్ని 2బీ బార్లతో పాటు, ఎలైట్ బార్లకు కూడా అనుమతులు ఇవ్వాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లా అనుమతించిన బార్ల సంఖ్య

అదిలాబాద్	05
కరీంనగర్	01
వరంగల్	04
ఖమ్మం	02
నల్లగొండ	01
మహబూబ్‌నగర్	05
మెదక్	01
నిజామాబాద్	04
రంగారెడ్డి	02

ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్నబియ్యం

- ప్రతి పేదవాడికి కడుపు నిండా అన్నం
- చరిత్రలో ఈ పథకం నిలిచిపోతుంది
- హుజూర్‌నగర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా గుత్తా, గడ్డం ప్రసాద్, మంత్రులు, ఎమ్మెల్యేల హాజరు

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

సూర్యాపేట, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి, ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ప్రతినెలా సన్నబియ్యం అందించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పేదోళ్లకు కడుపునిండా తిండి పెట్టేందుకే తమ ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారుల కోసం సన్నబియ్యం పథకాన్ని ఈ ఉగాది పర్వదినాన ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకం దేశ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో సన్నబియ్యం పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. తొలుత సీఎం, మంత్రి ఉత్తమ్‌తోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి 10 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వం 3 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తే ఆ బియ్యం రూ.10కి మిల్లర్లు కొని మళ్లీ ప్రభుత్వానికి రూ.30కి అమ్ముతున్నారని విమర్శించారు. ఇదంతా గమనించి పేదోళ్లు కూడా తినేలా సన్నబియ్యం ఇవ్వడంతో మిల్లర్ల అక్రమాలకు కూడా అడ్డుకట్ట వేసినట్టు అవుతుందని చెప్పారు. ఇది ఆషామాషీ పథకం కాదని, చరిత్రలో ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎవరు సీఎం అయినా ఈ సన్నబియ్యం పథకాన్ని రద్దు చేయలేరని తేల్చిచెప్పారు. ఆ చరిత్రకు హుజూర్‌నగర్ వేదిక కావడం, ఈ చైతన్యానికి మీరంతా ప్రతీకలే అని పేర్కొన్నారు.

నిర్బంధాలు.. అరెస్టులు

రామగిరి, మార్చి 30: హుజూర్‌నగర్ నియోజవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రతిపక్ష నేతలు, మాజీ సర్పంచులపై ప్రభుత్వం నిర్బంధకాండ విధించింది. బీఆర్‌ఎస్ నాయకులతోపాటు సీపీఎం, ఎమ్మార్పీఎస్ తదితర ప్రజాసంఘాలపై కక్షపూరితంగా వ్యవహరించింది. ఆదివారం ఉదయం నుంచే నేతల ఇండ్ల వద్దకు వెళ్లి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కొండమల్లేపల్లి, గుర్రంపోడులో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. హాలియా, చిట్యాల, దామరచర్లలో బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులను, త్రిపురారంలో మాజీ సర్పంచులను, తిరుమలగిరి సాగర్‌లో బీఆర్‌ఎస్వీ, దళిత సంఘాల నాయకులను, కట్టంగూర్‌లో సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులను, హుజూర్‌నగర్, మఠంపల్లి, పాలకవీడు, గరిడేపల్లి, అనంతగిరి, మద్దిరాల, అర్వపల్లిలో బీఆర్‌ఎస్, సీపీఎం నేతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నదని నిర్బంధంలో ఉన్న నేతలు మాట్లాడుతూ మండిపడ్డారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడంపై పలువురు నేతలు మండిపడ్డారు. నిర్బంధాలు, అరెస్టులతో ప్రభుత్వం పాలన సాగించలేదని, హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సర్కారు దృష్టి సారించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

రవీంద్రభారతిలో ఘనంగా ఉగాది వేడుకలు

ఉగాది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివానం జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచలంలో రాములవారి కల్యాణానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తూ అర్చకులు కల్యాణ పత్రికను అందజేశారు. అనంతరం పండితులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. తెలంగాణ రాష్ట్రం మిథున రాశి, పునర్వసు నక్షత్రంలో ఆవిర్భవించిందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల పాలకుల మధ్య పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. తెలంగాణలో వర్షాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, పంటలు అద్భుతంగా పండుతాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి బుద్ధి కుశలతకు పదునుపెట్టి పనిచేయాల్సిన అవసరముందని సూచించారు. ముఖ్యమంత్రికి నరఘోష తప్పదని, ఆయన చాలా కష్టపడి పనిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పంచాంగ శ్రవణం ముగిశాక ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల కలయిక మాదిరి ఉందని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక నిధులు కేటాయించారని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధికి కోసం భట్టి, తాను జోడెడ్ల మాదిరిగా కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, పేదలకు పంచాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. ఇది రాజకీయాలు చేసే సందర్భం కాదని, అభివృద్ధి చేసే సమయమని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం సంస్థలు, పార్టీలతో సత్సంబంధాలు కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానంగా మంత్రివర్గ విస్తరణతో పాటు హెచ్‌సీయూ భూముల వివాదం, సన్నబియ్యం పంపిణీ వంటి పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. ఈ భేటీ సుమారు గంటన్నర పాటు కొనసాగింది. ఈ నెల 3వ తేదీన మంత్రివర్గ విస్తరణ, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, వారికి శాఖల కేటాయింపులు కూడా ఉండే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రివర్గ విస్తర్ణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చోటు దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సహా 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు. మరో ఆరుగురికి క్యాబినెట్‌లో చోటు కల్పించే వెసులుబాటు ఉంది. అయితే ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో నలుగురికి మాత్రమే చోటు కల్పించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది. మరో ఇద్దరికి కొంతకాలం తర్వాత అవకాశం లభించనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి: జాన్‌వెస్లీ

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా కులగణన జరిపి, 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టరూపంలోకి తేవాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వెస్లీ, రాష్ట్ర నాయకులను ఎంబీభవన్‌లో కలిసి మద్దతు కోరింది. ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు సీపీఎం మద్దతిస్తున్నట్టు జాన్‌వెస్లీ తెలిపారు. తక్షణమే కేంద్రప్రభుత్వం ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరమని, ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు సీపీఎం పూర్తి మద్దతుగా నిలుస్తున్నదని జాన్‌వెస్లీ స్పష్టంచేశారు.

జూన్‌లో సాగుకు గోదావరి జలాలు

- మంత్రి తుమ్మల

వేంసూరు, మార్చి 30: వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మంజిల్లా రైతులు జూన్‌లో గోదావరి జలాలతో సాగు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మంత్రి తుమ్మల ఆయిల్‌పాం నూతన కర్మాగార పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అందుకుగాను ఎత్తిపోతల పెండింగ్ పనులకు సంబంధించి అంచనాలను సీఎం ఆమోదించినట్టు తెలిపారు.

వనపర్తి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

గురుకుల ప్రవేశ పరీక్షలో బాలుడి ఘనత

పెబ్బేరు, మార్చి 30 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాఖాపురంలోని ప్రగతి విద్యాలయానికి చెందిన విద్యార్థి ఆకాశ్ గురుకుల పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్టు ఆ పాఠశాల కరెస్పాండెంట్ భీంసాగర్ ఆదివారం తెలిపారు. కొత్తకోట మండలం నాటెల్లి గ్రామానికి చెందిన లక్ష్మి, నాగేంద్రం దంపతుల కుమారుడైన ఆకాశ్ తమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజాధనం లూటీకి రంగం సిద్ధం

- మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టర్ల చేతికే
- ఇదివరకు జెన్‌కో ద్వారా సిమెంట్, స్టీల్ కొనుగోలు
- ఇప్పుడు ఆ బాధ్యతలు కాంట్రాక్టర్లకు అప్పగింత
- ప్రాజెక్టు వ్యయాన్ని ఇష్టారీతిన పెంచుకునే చాన్స్
- వైటీపీపీ క్వార్టర్ల నిర్మాణ టెండర్లకు బ్రేక్
- సవరించిన నిబంధనలతో మళ్లీ కొత్త టెండర్లు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీజీ జెన్‌కో.. ప్రైవేట్ కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు రంగం సిద్ధం చేసింది. బడా సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకు ఏకంగా నిబంధనలనే సవరించింది. తద్వారా అత్యంత కీలకమైన సివిల్ వర్క్స్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌ను బడా కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఇదివరకు ఈ మెటీరియల్‌ను నేరుగా టీజీ జెన్‌కోనే సరఫరా చేసేది. జిందాల్, టాటా, వైజాగ్ స్టీల్ లాంటి ప్రతిష్ఠాత్మక కంపెనీల నుంచి సిమెంట్, స్టీల్, ఇతర నిర్మాణ సామగ్రిని కొనుగోలుచేసి, లేబర్ పనికి మాత్రమే టెండర్లు పిలిచేది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ లేబర్‌ను మాత్రమే సరఫరాచేసి, జెన్‌కో ఇచ్చిన మెటీరియల్‌తో నిర్మాణం చేపట్టేది. కానీ, ఇప్పుడు జెన్‌కో తన బాధ్యతల నుంచి వైదొలిగి పూర్తిగా ప్రైవేట్‌కు అప్పగించింది. దీంతో నాసిరకం నిర్మాణ సామాగ్రి వాడితే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

యాదాద్రి క్వార్టర్స్ టెండర్లకు బ్రేక్

నల్లగొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ)లో సిబ్బంది కోసం 1,000కిపైగా క్వార్టర్లతో భారీ టౌన్‌షిప్‌ను నిర్మిస్తున్నారు. ఇటీవలి కాలంలో టీజీ జెన్‌కో చేపట్టిన నిర్మాణాల్లో ఇదే అతిపెద్దది. ఈ టౌన్‌షిప్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇదిలావుండగానే కొత్తగా సివిల్ పనుల నిర్మాణాల్లో ధరల మార్పునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఆ క్వార్టర్ల నిర్మాణ టెండర్లకు బ్రేక్ పడింది. ధరల మార్పు నిబంధనను చేర్చి కొత్తగా మళ్లీ టెండర్లు పిలిచేందుకు సంస్థ కసరత్తు చేస్తున్నది. మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ బాధ్యతను ప్రైవేట్‌కు అప్పగించడం, నిర్మాణ ధరల మార్పునకు అనుమతి ఇవ్వడం వెనుక పెద్ద గూడుపుఠాణీ దాగిఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంతంటే అంత పెంచుకోవచ్చు

ధరల మార్పునకు అనుమతి ఇవ్వడంతో సివిల్ వర్క్స్ నిర్మాణ వ్యయం అమాంతం పెరగనుంది. వర్క్ తీసుకున్న తర్వాత సప్లిమెంటరీ రేట్ల పేరుతో ఇష్టారీతిన అంచనాలను పెంచుకునే అవకాశముంది. దీని వెనుక పెద్ద కుంభకోణం ఉన్నట్టు జెన్‌కో ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు. మొదట 1,500 కోట్లకు టెండర్ ఖరారు చేసిన ప్రాజెక్టు వ్యయాన్ని రేపు రివైజ్డ్ కాస్ట్ పేరుతో రూ.4 వేల కోట్లకు పెంచుకునే అవకాశలున్నాయని, ఇది టీజీ జెన్‌కో పాలిట శాపంగా మారుతుందని చెప్తున్నారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ నిబంధనను సవరించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్.. బాంచెన్!

మొదటిపేజీ తరువాయి...

మహాప్రభో.. అటూ వేడుకుంటున్నారు. ఈ విషయమై వివిధ ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా చలనం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగినా సర్కారు దిగిరావడమే లేదు.

కేసీఆర్ హయాంలో టంచన్‌గా

కేసీఆర్ పదేండ్ల పాలనలో టంచన్‌గా ఆసరా పింఛన్ సొమ్ము లబ్ధిదారుల చేతికి అందేది. ఒకటో తారీకు రాకముందే ఖాతాల్లో జమయ్యేది. దీంతో లబ్ధిదారులు దీమాగా ఉండేది. మందుబిళ్లల కొనుగోలుతో పాటు చిన్నచిన్న అవసరాలు తీర్చుకొనేది. కానీ కాంగ్రెస్ వచ్చాక లబ్ధిదారులకు మళ్లీ కష్టాలు మొదయ్యాయి. నెలానెలా పింఛన్ నగదుకోసం కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితుల్లో మళ్లీ కుటుంబ సభ్యులను దేహీ అంటూ దేబిరించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమ గోడు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఏనాడూ బాధపడలేదని, ప్రతినెలా వేళకు పింఛన్ సొమ్ము అందేదని ఆయనను తలుచుకుంటున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో మొండిచెయ్యి

అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే రూ.2,016గా ఉన్న ఆసరా పింఛన్ సొమ్మును రూ.4,000 చొప్పున ఇస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించనేలేదు. కనీసం పెంచకపోగా, 2023 ఆగస్టు, 2024 జనవరి నెలల పింఛన్ సొమ్ము రూ.2వేల కోటను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎగ్గొట్టింది. వివిధ కారణాలు చూపి సుమారు 3 లక్షల మంది లబ్ధిదారులను తొలగించింది. ఈ విషయమై గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసినా దాటవేసిందే తప్పా, సరైనా సమాధానం ఇవ్వలేదు. కనీసం కొత్తవారినైనా చేర్చాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడమే లేదు. 2025-26 బడ్జెట్‌లోనూ గతంలో మాదిరిగానే నిధులు కేటాయించి పింఛన్లు, లబ్ధిదారుల సంఖ్య పెంపు ఉండబోదని పరోక్షంగా తేల్చిచెప్పింది. పింఛన్ సొమ్ము పెంచకపోవడంపై, బకాయిలు ఇవ్వకపోవడంపై, ప్రతినెలా ఇవ్వకపోవడంపై లబ్ధిదారులంతా ఆగ్రహంతో ఉన్నారు.

కుట్టుకూలీపై కట్టుకథలు

- స్కూల్ పిల్లల యూనిఫామ్ జతకు సర్కారు చెల్లించింది రూ.50
- రూ.75 ఇచ్చామంటూ అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి భట్టి విక్రమార్క
- తిప్పికొట్టిన బీఆర్‌ఎస్ నేతలు
- ప్రభుత్వ పెద్దల అబద్ధాలపై మహిళా సంఘాల నేతల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా యూనిఫాంలు పంపిణీ చేస్తున్నది. వీటిని మహిళా సంఘాల సభ్యులు కుడుతుంటారు. వారికి ప్రభుత్వం యూనిఫాంకు రూ.50చొప్పున చెల్లిస్తున్నది. కానీ దానిపైనా కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ సాక్షిగా అబద్ధం చెప్పింది. తాము రూ.25 పెంచి రూ.75 ఇస్తున్నామని ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. కానీ ఇదంతా అబద్ధమని బీఆర్‌ఎస్ బయటపెట్టింది. కేవలం జీవో ఇచ్చి చేతులు దులుపుకొన్న సర్కారు అదనంగా చెల్లిస్తున్నామని చెప్పుకోవడమేంటని మహిళా నేతలు మండిపడుతున్నారు.

జీవో ఇచ్చి.. చెల్లింపు ఎగ్గొట్టి

బడి పిల్లలకు యూనిఫాంలు కుట్టే తమకు కూలీ గిట్టుబాటు కావడం లేదని, పెంచాల్సిందేనని గతంలో మహిళా సంఘాల నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్రం సమగ్ర శిషయోజన కింద ఒక్కో జతకు రూ.50 చెల్లిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కలిపి రూ.75 చొప్పున ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు నిరుడు జూన్ 7న ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చింది. జీవో రాగానే కూలీ పెరిగిందని మహిళా సంఘాల సభ్యులు భావించారు. రాష్ట్రంలోని 26,009 బడుల్లోని 18,58,841 మంది విద్యార్థులకు ఒక్కో జత చొప్పున కుట్టి అధికారులకు అందించారు. కానీ ప్రభుత్వం జతకు రూ.50 మాత్రమే చెల్లించింది. దీంతో మహిళా సంఘాల సభ్యులు షాక్‌కు గురయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు.

ఇవ్వకపోయినా ఇచ్చినట్టు!

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు యూనిఫాంలు కుట్టిన మహిళలకు ఒక్కో జతకు రూ.75 చొప్పున చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష యోజన కింద యూనిఫాం జతకు రూ.50 చొప్పున రూ.9,29,42,050 ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జీవో ప్రకారం మరో రూ.4,64,71,025 విడుదల చేయలేదు. మహిళ సంఘాల నేతలు మెప్మా, ఐకేపీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. కానీ అసెంబ్లీ సమావేశాల్లో మాత్రం రూ.75 చెల్లించామని ప్రభుత్వ పెద్దలు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

పడకేసిన పల్లె ప్రగతి

- ఉపాధి హామీ పనులకు నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వం
- ఏడాదిగా నిలిచిన మెటీరియల్ కాంపోనెంట్ పైసలు
- ప్రతి గ్రామంలో రూ.10 నుంచి రూ.50 లక్షల పనులు
- రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- 29 నుంచి తెరుచుకోని ఉపాధి పనుల నమోదు సైట్
- లబోదిబోమంటున్న పనులు చేసిన కూలీలు, కాంట్రాక్టర్లు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పల్లె ప్రగతి పడకేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గత ఏడాది ఆగస్టు నుంచి కేంద్ర గ్రాంట్స్ నిలిచిపోయాయి. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) గ్రాంట్స్ కూడా సుమారు ఏడాదిన్నరగా రావడం లేదు. దీంతో గ్రామాల్లో తీవ్ర నిధుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. గత కొన్ని నెలలుగా పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి, సొంత డబ్బులు వెచ్చించి గ్రామాల్లో నిర్వహణ కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు, ఏడాది కాలంగా జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులను పెండింగ్‌లో పెట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో 40 నుంచి 50 రకాల పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇంకుడు గుంతలు, వైకుంఠధామాలు, ఫిష్‌పాండ్స్, మొక్కలు నాటడం, నీరు చల్లించడం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు తదితర పనులు చేపడుతుంటారు. వీటికి సంబంధించిన పనులు మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామాల్లో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు నిర్వహించారు. కానీ, సంవత్సరకాలంగా చేసిన పనులకు నిధులు విడుదల కావడం లేదు. గత సంవత్సరం మార్చి వరకే బిల్లులు క్లియర్ అయ్యాయి. అప్పటి నుంచి చేసిన పనులకు పైసా రాలేదు.

ఉపాధి కూలీల ఆందోళన

ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద 40% నిధులు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ఏటా గ్రామసభలు నిర్వహిస్తూ అవసరమయ్యే పనులు, దాని ఖర్చును ముందుగానే అంచనా వేస్తారు. ఈ సారి డిసెంబర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని అనేక గ్రామాల్లో నిర్ణయించారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉనాయి. ఒక్కో గ్రామంలో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.50 వరకు ఖర్చుతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మేనేజ్‌మెంట్ బుక్ (ఎంబీ) రికార్డులు కూడా పూర్తయ్యాయి. కానీ, ఆన్‌లైన్‌లో ఆయా పనుల వివరాలు నమోదు చేద్దామంటే ఈ నెల 29 నుంచి వెబ్‌సైట్ మెరాయిస్తున్నదని సీసీరోడ్లు నిర్మించినవారు చెప్తున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున చేసిన పనులకు బిల్లులు అందవేమోనని ఉపాధి హామీ పథకం కూలీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

76లక్షల మిలియన్ టన్నులు.. సింగరేణి లక్ష్యం

- కొత్తగూడెం వీకే ఓసీకి పర్యావరణ అనుమతులు
- ఉత్పత్తికి మార్గం సుగమం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : రాబోయే ఆర్థిక సంవత్సరంలో 76లక్షల మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. అడ్డంకులను అధిగమించి, కొత్త గనులను చేపట్టి 76లక్షల మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయాలని టార్గెట్‌గా పెట్టుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడం, 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంకానుండటంతో సంస్థ లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నది. 2024-25లో సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోగా, లక్ష్యాన్ని చేరలేకపోయింది. వర్షాలు, కొత్త గనులకు అనుమతులు రాకపోవడం ఇందుకు కారణమని సింగరేణి వర్గాలు వెల్లడించాయి. 2024-25లో సంస్థ పరిధిలోని కిష్టారం ఓసీ, పీకే ఓసీ-4, జీడీకే-5 ఓసీ, ఆర్జీ ఓసీ-2, ఆర్కే-6 ఇంక్లైన్, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీ-2 గనులు ఈ ఏడాది నిర్ధేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయి. మిగతా గనులు లక్ష్యాన్ని సాధించడంలో వెనుకబడ్డాయి.

త్వరలోనే వీకే ఓసీ నుంచి వెలికితీత

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కొత్తగూడెం వెంకటేశ్ ఖని(వీకే) ఓపెన్ కాస్టుకు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇటీవలే ఢిల్లీలో నిర్వహించిన ఎన్విరాన్‌మెంట్ అప్రైజల్ కమిటీ అనుమతులు జారీచేసింది. దీంతో ఈ ఓపెన్‌కాస్టుకు పూర్తిస్థాయి పర్యావరణ అనుమతులు లభించినట్టయ్యింది. త్వరలోనే ఈ ఇందులో బొగ్గు వెలికితీతను చేపట్టనున్నారు. ఇల్లందులోని రొంపేడు ఓపెన్‌కాస్టుకు అనుమతులు రావాల్సి ఉంది. ఇది కూడా పూర్తయితే రోజుకు 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి మార్గం సుమగం కానున్నది.